క్లుప్తంగా

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

జగద్గిరిగుట్ట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు నియో కర్సర్, టెక్ మహేంద్ర ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో తిరుగుతూ యువతకు ఈ శిక్షణ కార్యక్రమాలను గురించి తెలియజేశారు. 4 నెలల ఈ కోర్స్‌లో చేరడానికి ఇంటర్ పాసై ఉంటే సరిపోతుందని బ్యాంకింగ్, ఫైనాన్షియల్ ఇన్సురెన్స్ సర్టిఫికెట్ కోర్సులు ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నం.77995 94242, 77996 94242.

సర్కారు బడి పిల్లలకు ఉచిత ట్యూషన్

జగద్గిరిగుట్ట: 5వ తరగతి నుంచి 10వ తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్‌లు నిర్వహిస్తున్నట్లు విద్యా బాలాజీ ట్యూషన్ యాజమాన్యం తెలియజేసింది. డివిజన్ పరిధిలోని సోమయ్యనగర్‌లో ఎంకేఆర్ ఫంక్షన్‌హాల్ వద్ద ఉన్న ఈ సెంటర్‌లో ఉదయం 5 నుంచి 7గంటల వరకు, తిరిగి సాయంత్రం 5గంటల నుంచి 9గంటల వరకు ఈ ట్యూషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చేరాలనుకునే వారు ఫోన్ నం. 98668 83688 సంప్రదించవచ్చన్నారు.

మర్యాదపూర్వక కలయిక



కార్పొరేటర్‌ను సత్కరిస్తున్న శ్రీవేన్ ఎన్‌క్లేవ్ నూతన కమిటీ సభ్యులు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ శ్రీవేన్ ఎన్‌క్లేవ్ నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కార్పొరేటర్ రావుల శేషగిరిని కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ మెంబర్స్‌ను కార్పొరేటర్ అభినందించారు. అనంతరం కాలనీలో ఉన్న పెండింగ్ పనుల విషయమై నూతన కమిటీ మెంబర్లు కార్పొరేటర్‌తో చర్చించారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే పెండింగ్ పనులను ఒక్కొక్కటిగా చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

దశలవారీగా పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

జగద్గిరిగుట్ట: పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను దశలవారీగా పూర్తి చేస్తానని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ తెలిపారు. సోమవారం డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్‌లోని పలు కాలనీలలో రోడ్డు, డ్రైనేజీ, మంచినీటి సమస్య పూర్తి చేసామన్నారు. ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, భిక్షపతి, మురళి, గణేష్, చంద్రశేకర్, ప్రభాకర్, మనోజ్, యాదగిరి, నాని తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి జాతర



పూజల్లో పాల్గొన్న మెట్కానిగూడవాసులు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్‌లోని మెట్కానిగూడలో శ్రీమల్లికార్జునస్వామి జాతరలో భాగంగా సోమవారం సల్లుట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, భీంరెడ్డి, సత్తిరెడ్డి, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిళలు లేని రంగమంటూ లేదని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నర్సింహా రెడ్డి ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో సోమవారం తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ విచ్చేసి మహిళా దినోత్సవ ప్రాముఖ్యత, మహిళా శక్తి విశిష్టతపై మాట్లాడారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలోని మహిళా ఉద్యోగులకు వివిధ రకాల క్రీడలు నిర్వహించగా గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్, కార్యదర్శి వి.రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి టి.వాణి రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్ రావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి.సంయుక్త, ఉపాధ్యక్షురాళ్లు గౌరీవత్సల, ప్రసన్న, కార్యవర్గ సభ్యులు సంజీవరావు, పద్మప్రియ, అహల్య, సరిత, విజయలక్ష్మి, గీత, శశికళ పాల్గొన్నారు.

పరిశ్రమల గేట్లకే.. భద్రతా వారోత్సవాలు

- అనుభవం లేని కార్మికులతో పనులు
- తరచూ ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న కార్మికులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు





ఇటీవల మృతిచెందిన కార్మికుడు కుమార్ సరెన్ మరో కార్మికుడు నరేంద్ర



జీడిమెట్లలోని ఓ పరిశ్రమ గేటుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

జీడిమెట్ల: ప్రతి సంవత్సరం జాతీయ భద్రతా వారోత్సవాల నిర్వాహణ జీడిమెట్లలో పరిశ్రమల గేట్లకు ఫ్లెక్సీల వరకే పరిమితం అవుతోంది. భద్రతా వారోత్సవాల ముఖ్య ఉద్దేశం పరిశ్రమల్లో కార్మికుల భద్రతా పటిష్టంగా ఉండేలా పరిశ్రమ చర్యలు తీసుకోవాలని తెలియజేయడమే. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో మాత్రం పరిశ్రమ యాజమాన్యాలు ఒక ఫ్లెక్సీని గేటుకు వేలాడదీసి వారం రోజుల తర్వాత తొలగిస్తున్నారు. 4 సంవత్సరాలుగా జీడిమెట్లలో ఇదే తంతు కొనసాగుతోంది. అధికారులు గాని పరిశ్రమల యాజమాన్యాలు గాని కార్మికుల భద్రతా విషయంలో ఎలాంటి అవగాహన సదస్సులు నిర్వహించకపోవడంతో పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో కార్మికులు మృత్యువాత పడుతూనే ఉన్నారు.

కాసులకు కక్కుర్తి.. అనుభవం లేని కార్మికులతో పనులు

కాసులకు కక్కుర్తి పడే పరిశ్రమలు అనుభవం లేని కార్మికులతో తక్కువ వేతనానికి పని చేయిస్తూన్నారు. కనీసం డిగ్రీ లేని కార్మికులను పనుల్లోకి తీసుకుని రసాయనాలపై అనుభవం లేని కార్మికులతో పనులు చేయిస్తున్నారు. దీంతో ప్రమాదాలు రసాయన పరిశ్రమల్లోనే ఎక్కువగా జరుగుతున్నాయి.

అవగాహన సదస్సులు లేవు.. కార్మికుల ప్రాణానికి భరోసా లేదు

ప్రతి సంవత్సరం భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రతి పరిశ్రమలో సేఫ్టీ టీమ్‌ను ఏర్పాటు చేసి కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి కార్మికులు పరిశ్రమలో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలి. కాని ధనదాహంతో పరిశ్రమల్లో ఎలాంటి అవగాహన సదస్సులు నిర్వహించకుండానే భద్రతా వారోత్సవాలను మమ అనిపిస్తున్నారు.

ఇటీవల జీడిమెట్లలో జరిగిన ప్రమాదాలు..

- 2023 ఫిబ్రవరి 1వ తేదీన గంపలబస్తీలోని ఓ రీసైక్లింగ్ పరిశ్రమలో రసాయన డ్రమ్ము పేలడంతో విజయ్ ప్రతాపతి (38) అక్కడికి అక్కడే మృతి చెందాడు.
- 2023 ఫిబ్రవరి 8వ తేదీన ఓ రసాయన పరిశ్రమలో బాయిలర్ శుభ్రం చేస్తుండగా రసాయనాలు మీద పడటంతో మేఘనాథ్(35) మృతి చెందగా మరో ఇద్దరు కార్మికులు జయదేవ్ దలాయి, శశిధర్‌లు తీవ్రంగా గాయపడ్డారు.
- 2023 మార్చి 1వ తేదీన జీడిమెట్ల ఫేజ్-4లోని ఫార్మా పరిశ్రమలో బాయిలర్ పేలడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న కుమార్ సరేన్(25), నరేంద్ర(26)లు అక్కడికి అక్కడే సజీయ దహనమయ్యారు.

అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తాం..



నేషనల్ సెఫ్టీ కౌన్సిల్ నిబంధనల ప్రకారం మార్చి 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు 54వ జాతీయ భద్రతా వారోత్సవాలను నిర్వహించనున్నాం. జీడిమెట్లలో త్వరలోనే వివిధ పరిశ్రమల సిబ్బందితో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్

వసతులు కల్పించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన దుండిగల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ పద్మారావు తదితరులు

కుత్బుల్లాపూర్: ప్రజలకు మౌలిక వసతులు కల్పించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే విధంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ శంభీపూర్ రాజు అన్నారు. సోమవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజలు ఎమ్మెల్సీని కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలు సమర్పించారు. అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి పనులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. బహదూర్‌పల్లిలో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణం కోసం దుండిగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు ఎమ్మెల్సీని కలిశారు. ప్రణాళికలు రూపొందించి తప్పకుండా పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

- ఈ సందర్భంగా శంభీపూర్ రాజు మాట్లాడుతూ... కొంపల్లి, దుండిగల్, నిజాంపేట్ కార్పొరేషన్లతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న కాలనీలు, మురికివాడ ప్రాంతాల్లో గతంలో ఎన్నడు జరగని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ నిధుల విషయంలో జాప్యం జరుగకుండా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకోవాలి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న నాగరాజ్‌యాదవ్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో చోటు చేసుకుంటున్న ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నిజాంపేట్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజ్‌యాదవ్ సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిజాంపేట్ సర్వే నం .348, 334లలోని ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా కలుపుకుని భవనాలు నిర్మించారన్నారు. దీనిపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా చర్యలు చేపట్టడంతో నిర్మాణదారులు సదరు భవనాలను విక్రయించుకున్నారని పేర్కొన్నారు. సర్వే నం .334లోని ప్రభుత్వ భూమిని జర్నలిస్ట్‌లకు ఇవ్వగా ఓ వ్యక్తి 40 ఫీట్ల రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా తురక చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన నిర్మాణాలను తొలగించాలని కోరారు.

నాకెందుకులే.. అని అనుకోలేదు!



పోస్టర్లను తొలగిస్తున్న వ్యక్తి..

జగద్గిరిగుట్ట: అతని పేరు విశ్వేశర శర్మ. ఇక్కడ కనిపిస్తున్న వ్యక్తి ట్రాఫిక్ సిబ్బంది ఏర్పాటు చేసిన బొల్లార్డ్ పై పెయింట్ వేస్తున్నట్లో.. ఏదైనా స్టికర్‌ను అతికించడంలో బిజీగా ఉన్నట్లో కనిపిస్తున్నాడు. కాని అక్కడ అతను చేస్తున్న పనిని చూసి అందరు సలాం కొట్టక తప్పలేదు. వివిధ ప్రకటనలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను పలు ప్రదేశాల్లో అతికించడం మనం చూస్తుంటాం. కాగా అలాంటి పోస్టర్‌ను జగద్గిరిగుట్ట, ఇందిరాగాంధీ విగ్రహం వద్ద అతికించడం చూసిన ఓ వ్యక్తి సమాజానికి ఉపయోగపడని స్టిక్కర్లను తీసివేస్తూ కనిపించారు. ఎన్నో లక్షలు వెచ్చించి అధికారులు నిర్మిస్తున్న కంపౌండ్ వాల్‌పై అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రకటనలపై అనవసరమైన పోస్టర్లు అంటించడం మంచిది కాదని.. ఇలాంటివి ఏమైనా కనిపిస్తే సాధ్యమైనంత వరకు తీసిపేస్తానని.. అందరు తన లాగే తమ విధిగా ఎదురిస్తే కొంత తగ్గించవచ్చని ఆయన తెలిపారు.

ఆలోచనలకు పదును పెడితే ఉజ్వల భవిష్యత్



సైన్స్ షోను తిలకిస్తున్న జీడిమెట్ల సీఐ పవన్, హెచ్ఎం శ్రీనివాస్‌గౌడ్

కుత్బుల్లాపూర్: చిన్నతనం నుంచే సృజనాత్మక ఆలోచనలకు పదును పెడితే విద్యార్థులకు ఉజ్వల భవిత ఉంటుందని జీడిమెట్ల సీఐ పవన్ అన్నారు. సోమవారం సుభాష్‌నగర్‌లోని వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ షోను ఆయన ప్రధానోపాధ్యాయుడు మండవ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు సైన్స్ నమూనాలను తిలకించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు.

- అనంతరం టెన్త్ పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.5వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ మండవ సునీత, క్యూఎంఆర్ఎస్ఎంఏ చైర్మన్ శివయ్య, అధ్యక్షుడు వరప్రసాద్, కోశాధికారి దయాకర్, ట్రస్మా ఉపాధ్యక్షులు శ్యామల రావు, భూపాల్ రెడ్డి, సలహాదారుడు నర్సిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవికుమార్, వీరన్న, ఎమ్మార్పీ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో జోరుగా హాథ్ సే హాథ్ జోడో

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా హాథ్ సే హాథ్ జోడో యాత్రలు జోరుగా కొనసాగుతున్నాయి. సూరారం కాలనీ రాజీవ్‌గాంధీనగర్‌లో టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగురవేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తూర్పారబట్టారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ఆవిజె జేమ్స్, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, పండరి రావు తదితరులు పాల్గొన్నారు.

- కొంపల్లి మున్సిపాలిటీలోని సెంట్రల్ పార్కు, కొంపల్లి తదితర ప్రాంతాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్యోత్స్నాశివారెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్రను చేపట్టి సమస్యలు తెలుసుకున్నారు. అధిక నీటి బిల్లులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ అధికారులకు మెమొరాండంను అందజేశారు. ఈ యాత్రలో కౌన్సిలర్లు శ్రీవిద్య, సరిత, నాయకులు ఖైరి ప్రశాంత్‌గౌడ్, కందాడి సుదర్శన్‌రెడ్డి, ఆదిరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీనగర్‌లో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీపీసీసీ ప్రతినిధి హన్మంతరెడ్డి



నీటి బిల్లులు తగ్గించాలని మెమొరాండం అందజేస్తున్న జ్యోత్స్నారెడ్డి, కౌన్సిలర్లు

మురుగు.. పరుగు పట్టించుకునేదెవరు?



సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డు కల్వర్టు వద్ద ప్రధాన రోడ్డుపై నిత్యం మురుగు పొంగిపొర్లడంతో అటు వైపుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు ఈ రోడ్డుపై నుంచి వివిధ విభాగాల అధికారులు వెళ్తున్నప్పటికీ రోడ్డుపై నెలకొన్న సమస్యను గుర్తించలేకపోవడం గమనార్హం. ఇప్పటికైన అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– కుత్బుల్లాపూర్

అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్



ప్రగతియాత్రలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని హరిజన్‌బస్తీ, గార్డెన్ బస్తీ, కుత్బుల్లాపూర్ గ్రామం, ప్రశాంత్ నగర్, భోళా శంకర్‌నగర్, భుమిరెడ్డి కాలనీలలో 'ప్రగతి యాత్ర'లో భాగంగా ఆయన పాదయాత్ర చేపట్టి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు.

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశలవారీగా అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ వస్తున్నామన్నారు. ప్రజలకు ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు.సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.
- జీడిమెట్ల డివిజన్ భూమిరెడ్డికాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సాయిబాబా ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఆలయాభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు.
- జీడిమెట్ల డివిజన్ పరిధి కుత్బుల్లాపూర్‌లోని భోళాశంకర్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మల్లేష్‌యాదవ్ ఇటీవలే జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వివేకానంద్ తన వంతు సహాయంగా రూ.50 వేలు అందజేశారు. ప్రభుత్వ పరంగా అందుకుంటానని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తా



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌కు సమస్యలు వివరిస్తున్న మహిళలు

రంగారెడ్డినగర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు విచ్చేసి తమ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా చూడాలని వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అవసరమైన ధర్నాలు, ప్రజా పోరాటాలు చేసైనా అధికారులు దిగొచ్చి పరిష్కార మార్గాలు చూపే విధంగా ఒత్తిడి తీసుకొస్తానని స్పష్టం చేశారు. పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో శ్రీశైలంగౌడ్ నివాస ప్రాంతం కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానిక బస్తీ, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

'ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పని చేస్తోంది'



చాకలి బస్తీలో వృద్ధురాలి యోగాక్షేమాలు తెలుసుకుంటున్న కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని దుండిగల్ మున్సిపల్ 16వ వార్డు కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం భౌరంపేట్ వార్డు పరిధిలోని చాకలి బస్తీ, ముస్లిం బస్తీలలో ఆయన పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముస్లిం బస్తీలో బీఆర్ఎస్ కార్యకర్తల అంజద్ ఇటీవల బైక్ ప్రమాదానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్‌రెడ్డి అతడిని పరామర్శించి తన వంతు సహాయంగా రూ.10వేలను అందజేశారు. అదే విధంగా ఇమామోద్దీన్ అనారోగ్యానికి గురికాగా అతనికి సైతం రూ.10వేలు అందజేశారు. వార్డు బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ ప్రెసిడెంట్ అక్రం, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మన్నె బాలరాజు, జితయ్య, ఇమ్రాన్, నరేష్ తదితరులు ఉన్నారు.

ఒత్తిడిని జయిస్తే పరీక్షల్లో విజయం సాధించినట్టే..



కుత్బుల్లాపూర్: విద్యార్థులు ఒత్తిడిని పక్కన పెడితే పరీక్షల్లో ఉత్తీర్ణులు అవుతారని మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో జీడిమెట్ల డివిజన్ సరోజినీ గార్డెన్‌లో టెన్త్ క్లాస్ విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. లక్ష్మీనారాయణ, అనంతలక్ష్మిలు ముఖ్యఅతిథులుగా హాజరై పలు సూచనలు చేశారు. పరీక్ష సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఉండాలన్నారు. ఒత్తిడిని జయిస్తే పరీక్షల్లో విజయం సాధించినట్టేనని అన్నారు. ఈ సందర్భంగా అపురూప కాలనీకి పీవీఆర్ మోడల్ హైస్కూల్ విద్యార్థులు జేడీ లక్ష్మీనారాయణను ప్రత్యేకంగా కలిసి ఆయన ఆటోగ్రాఫ్‌లు తీసుకున్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



శ్రీదుర్గా సాంభవి గ్రూపు ఆధ్వర్యంలో సుభాష్‌నగర్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న సురేష్‌రెడ్డి



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న కుత్బుల్లాపూర్ మహిళా గ్రూపు సభ్యులు

నిజాంపేట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిజాంపేట్ కొలన్ రాఘవరెడ్డి ఫంక్షన్‌హాలులో ఆకృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో గుర్తింపు తెచ్చుకుంటున్నారని అన్నారు. మహిళల అభ్యుదయానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలను సత్కరించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రణయ, ఆవుల పావని, రాజేశ్వరి, సురేష్‌రెడ్డి, గాజుల సుజాత, విజయలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యునాలే జ్యోతి, ఫౌండేషన్ చైర్‌పర్సన్ రాగా శైలజ, ఫౌండేషన్ నిజాంపేట్ సభ్యులు సుజాత, లావణ్య, ప్రశాంతి, అరుణకుమారి, కుమారి, రాధికా, జ్యోతి, లక్ష్మి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

- మహిళలను సత్కారం..

కుత్బుల్లాపూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా గ్రూపు సభ్యులతో కేక్‌లు కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సత్కరించి మెమొంటోలు అందజేశారు.

జీడిమెట్ల డిపోలో..

జీడిమెట్ల: స్త్రీలు అన్నిరంగాల్లో రాణించినప్పుడే సమాజంలో ఆడ, మగ అసమానతలు తొలుగుతాయని దుండిగల్ మండల ఆరోగ్యాధికారి డా.నిర్మల అన్నారు. సోమవారం జీడిమెట్ల డిపోలో నిర్వహించిన మహిళా దినోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలో కండక్టర్లుగా విధులు నిర్వర్తిస్తున్న మహిళలను ఆమె కొనియాడారు. ఈ సందర్భంగా జీడిమెట్ల డిపోలో మహిళా ఉద్యోగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు ఆమె బహుమతులను అందజేశారు. ఆర్టీసీ బస్సులో ప్రతిరోజు ప్రయాణించే మహిళా ప్రయాణికులు రాజ్యలక్ష్మి, మాధవి, ప్రమీలను డిపో మేనేజర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ విజయ్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ స్వాతి ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



జీడిమెట్ల డిపోలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళా ఉద్యోగులు